క్లుప్తంగా

నేటి నుంచి రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్ఆర్పేట): జిల్లాలోని భీమడోలు–పెదవేగి 232 కేవీ ఫీడర్కు ప్రస్తుతం ఉన్న కండక్టర్ను మార్పు చేస్తున్నామని, దీని నిమిత్తం గురువారం నుంచి పెదవేగి 132/33కేవీ సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకూ ఇదే విధంగా వ్యవసాయానికి రోజూ రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని ఆయా ప్రాంతాల రైతులు ఈ విషయాన్ని గ్రహించి అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి


లక్ష్మణరావు

ఏలూరు టౌన్: పట్టణంలోని ప్రజలు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు నగరంలో వాహనదారులు తప్పకుండా హెల్మెంట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

హెల్మెట్ధారణపై అవగాహన


హెల్మెట్పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగ కల్యాణి

ఏలూరు టౌన్: పట్టణంలో టూటౌన్ మహిళా ఎస్సై నాగకల్యాణి బుధవారం హెల్మెట్ధారణపై అవగాహన కల్పించారు. ఏలూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న తాపీ మేస్త్రీ లు, తాపీ కూలీలకు ద్విచక్ర వాహనాలు కలిగిన ఉన్నటువంటి వారికి హెల్మెట్ ధరించడం వలన కలిగే ఉపయోగాలను గురించి వివరించారు. బైక్ నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలకు అపాయం కలగకుండా హెల్మెట్ మిమ్మల్ని కాపాడుతుందన్నారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని స్పష్టం చేశారు.

కాలుష్య కాసారంగా తమ్మిలేరు

- పర్యావరణానికి పెను ముప్పుగా మారిన వైనం
- అన్ని వ్యర్థాలూ తమ్మిలేరులోనే
- నిర్వహణ లోపంతో కుప్పలుగా పేరుకుపోతున్న చెత్త


బాలయోగి వంతెన సమీపంలో పూర్తి వ్యర్థాలతో నిండిపోయిన తమ్మిలేరు


తంగెళ్లమూడి వద్ద పూర్తిగా గుర్రపు డెక్కతో నిండిపోయిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరానికి రెండు వైపులా ఇటు పడమర వైపు, అటు తూర్పువైపు విస్తరించి ఉన్న తమ్మిలేరు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుంది. దీంతో తమ్మిలేరు కాలుష్య కాసారంగా దర్శనమిస్తుంది. నిర్వహణ లోపంతో పాటు నగర ప్రజలు అన్ని రకాల వ్యర్థాలను తమ్మిలేరులోనే వేస్తుండడడంతో కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్గా తమ్మిలేరు నిలుస్తుంది. ఆఖరికి జంతు కళేబరాలను సైతం తమ్మిలేరులోనే వసేస్తుండటంతో తమ్మిలేరు కాలుష్యం భారీగా పెరుగుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు, చెత్త, చెదారం, జంతు కళేబరాలు వేస్తుండటంతో పాటు తమ్మిలేరు నిర్వహణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల పరిస్థితి మరీ దారుణంగా తయారవుతుంది.

నిత్యం దుర్వాసన

తమ్మిలేరు పెద్ద ఎత్తున గుర్రపు డెక్క, తూడు,చెత్త వంటివి పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. ఈ కారణంగా తమ్మిలేరు ఏటిగట్టు ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు ప్రతినిత్యం దుర్గంధం మధ్యే నివసించాల్సిన దుస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. తక్షణం తమ్మిలేరు ప్రక్షాళనకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఏలూరునగర వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు. చింతల పూడి మండలం నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు వద్ద నుండి ప్రారంభమైన తమ్మిలేరు ఏలూరు దగ్గరకు వచ్చే సరికి ఏలూరు–చింతల పూడి మార్గంలోని ఎఫ్సీఐ గొడౌన్స్ వద్ద నుంచి తమ్మిలేరు రెండు పాయలుగా చీలుతుంది. ఒక చీలిక తూర్పు వైపుగా ప్రవహించి తంగెళ్లమూడి, ఏటిగట్టు, మార్కెట్ యార్డు రోడ్డు,రైల్వే ట్రాక్ దాటుకుని తూర్పు లాకుల వద్ద కొల్లేరులోకి కలుస్తుంది. మరో చీలిక అశోక్ నగర్,అమీనా పేట, గ్జేవియర్ నగర్ మీదుగా నగరం మధ్య నుండి కొత్త బస్టాండ్కు సమీపంలోని వంతెన దిగువగా ప్రవహించి పడమర లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవేశిస్తుంది.

వర్షాకాలం మినహా అన్ని రోజుల్లోనూ ఇబ్బందులే

వర్షాకాలం నిత్యం నీరు దిగువకు ప్రవహిస్తుండటంతో ప్రజలకు పెద్దగా ఇబ్బంది లేకుండా ఉంటుంది. వర్షాకాలం అనంతరం తూర్పు,పడమర లాకులను పూర్తిగా మూసివేస్తారు. దీంతో వర్షాకాలం మినహా మిగిలిన అన్ని రోజుల్లోనూ ఏలూరున గర ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతూనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో పెద్ద ఎత్తున వరద నీరు వస్తున్న సమయంలో తమ్మిలేరులోని అన్ని వ్యర్థాలు నీటి ప్రవాహంతో పాటు కొల్లేరులోకి వెళుతూ ఉంటాయి. మిగిలిన రోజుల్లో వేసిన వ్యర్థాలు ఎక్కడివక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు.

తమ్మిలేరు వరద నివారణకు గత ప్రభుత్వం చర్యలు

తమ్మిలేరు వరదలుకారణంగా ఏటా ఏలూరునగరంలోనిపలు పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోవడం, ప్రజలు నానా అవస్థలు పడుతుండటం గమనించిన గత వైసీపీ ప్రభుత్వం తమ్మిలేరు వరద నివారణ చర్యలు తీసుకుంది. తమ్మిలేరుకు పలు చోట్ల రూ.140 కోట్లు వరకు వెచ్చించి రివిట్మెంట్లు నిర్మించింది. దీంతో ఏలూరు నగర వాసులకు తమ్మిలేరు వరద ముప్పు తప్పింది. ఇక చేయాల్సిందల్లా ఏటా సాదారణ నిర్వహణ మాత్రమే.దీన్ని కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ్మిలేరు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతూ కన్పిస్తుంది.

నిర్వహణ అధ్వానం

తమ్మిలేరును ప్రతి ఏటా సాధారణ నిర్వహణ నిత్యం నిర్వహించాల్సిన కార్యక్రమాలు ఎక్కడ చేసినట్లు కన్పించడం లేదు. దీనికి తోడు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు లేవు. దీంతో అడిగే వారు లేక పోవడంతో కబేళా నిర్వాహకులు, రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించే చిరు వ్యాపారులు, స్థానికులు అన్ని రకాల వ్యర్థాలను తీసుకు వచ్చి తమ్మిలేరులో వేసేస్తున్నారు. దీంతో నీటి పారుదల లేకుండా ఉంటున్న తమ్మిలేరులో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది.

తమ్మిలేరు దుర్గంధం నుంచి కాపాడాలి



నిర్వహణ లోపం వల్ల తమ్మిలేరు దుర్గంధం వస్తుంది. స్థానిక ప్రజలను ఈ దుర్గంధం నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వర్షాలు, వరదలు వచ్చినప్పుడు మాత్రం హడావుడిగా అది చేస్తాం..ఇది చేస్తాం..అంటూ హామీలు ఇవ్వడం మినహా చేసిందేమి లేదు. ప్రతి ఏటా తమ్మిలేరును శుభ్రం చేయడం, చెత్త తొలగించడం వంటి కార్యక్రమాలు చేస్తూ ఉంటే ఈ సమస్య చాలా వరకు తగ్గుతుంది.

– పి.ఆదిశేషు, ఏటిగట్టు నివాసి,ఏలూరు వన్టౌన్

తమ్మిలేరును ప్రక్షాళన చేయాలి



కాలుష్యంతో నిండిపోయి వ్యర్థాలకు నిలయంగా మారిన తమ్మిలేరును పూర్తిగా ప్రక్షాళన చేయాలి. దీనికి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. క్రమం తప్పకుండా ప్రతి ఏటా తమ్మిలేరు పూడికను తీయాలి. తద్వారా వర్షాలు సమయంలో అధికంగా వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం వీలుగా ఉంటుంది.

– బండి వెంకటేశ్వరరావు,బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఏలూరు

ఉత్సాహంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్పేట): ఏలూరు సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక సెయింట్ గ్జేవియర్ హైస్కూల్ గ్రౌండ్స్లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏలూరు నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాల డినోమినేషన్స్ కలిసి నిర్వహించిన ఈ సభలో 10 వేల మందికి పైగా హాజరయ్యారు. తొలుత అతిథులు క్రిస్మస్ కేక్ కట్ చేసి విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ దైవసేవకులు ఎన్.జయపాల్ (కల్వరి దర్శనం – చెన్నై) దైవ సందేశం అందించారు. ఆర్సీఎం బిషప్ పొలిమేర జయరావు, ఐసీఎం బిషప్ జాన్ ఎస్డీ రాజు, మన్నా బిషప్ ఎం. ఎలీషా రాజు, పాస్టర్ టి. ఎబినేజర్ శాస్త్రి, పాస్టర్ ఎమ్.జ్యోతి రాజు, పాస్టర్ బీరపోగు యోహాను, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): ఢిల్లీలో ఈ నెల 6,7,8 తేదీల్లో జరిగే మహిళా సమాఖ్య జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, వరక శ్యామల, మన్నవ యామిని కోరారు. స్థానిక ఆర్ఆర్పేటలోని స్ఫూర్తి భవన్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు,హత్యలు,అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన చట్టాలు రూపొందించే విధంగా ఈ జాతీయ మహాసభలలో చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తారని తెలిపారు. మహిళా సమాఖ్య జాతీయ మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు

ఏలూరు (ఆర్ఆర్పేట): నగరానికి చెందిన ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏలూరు నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఉప్పలపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మద్దాల శేఖర్, ఉపాధ్యక్షుడిగా మెగా దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎన్డీ ప్రసాద్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను నగరంలోని పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి సాంస్కృతిక వారోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్పేట): నగరంలోని సీఆర్ఆర్ మహిళా కళాశాలలో గురువారం నుంచి సాంస్కృతిక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్పందన, పుస్తక సమీక్ష జరుగుతాయని, అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 6న మెహందీ, హెయిర్ డ్రెస్సింగ్ పోటీలు, పద్య పఠనం, సంగీత పోటీలు, 7న పెయింటింగ్, రంగోలీ, క్విజ్ ప్రిలిమినరీ పోటీలు, 8న వంటల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 9న క్విజ్ ఫైనల్ పోటీలు, డిబేట్, 10న కూరగాయల అలంకరణ, ఫ్లోర్ డెకరేషన్, ఏకపాత్రాభినయం, మూకాభినయం, మిమిక్రీ, స్కిట్ పోటీలు జరుగుతాయని వివరించారు. ఉత్సవాల చివరి రోజున వక్తృత్వ పోటీలు, వ్యర్థాలనుంచి ఉత్పత్తులు తయారు చేయడం, నృత్య పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన


డెంగీ కరపత్రాల ఆవిష్కరిస్తున్న ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. శర్మిష్ట

ఏలూరు టౌన్: డెంగీ, మలేరియా, ఇతర విష జ్వరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ట సూచించారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం డెంగీ, మలేరియా కరపత్రాలను ఆవిష్కరిస్తూ ప్రజలకు కరపత్రాల ద్వారా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులపై, దోమల నిర్మూలన పద్ధతులు పై, భవిష్యత్తులో దోమల ద్వారా వచే వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, వ్యాధులపై విస్తృత అవగాహన కలిప్ంచాలన్నారు. దోమ లార్వాలను నిర్మూలించాలంటే ఫ్రైడే డ్రైడే, ఇంటి లోపల ఇంటి బయట వారానికి పైబడి మంచి నీళ్లు నిల్వ ఉంచరాదని, నేల తొట్లపై మూతలు పెట్టుకోవాలని కరపత్రాల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, ఐడీఎస్పీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చక్రధర్ రావు , వైద్యాధికారి డాక్టర్ శశాంక్, డెమో నాగరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో డ్రోన్ స్ప్రేయింగ్ పరిశీలన


డ్రోన్ స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బుట్టాయగూడెం: వ్యవసాయ డ్రోన్లు పంట పెరుగుదల దశలో, పంట ఆరోగ్యం, నేల వైవిధ్యాలపై సమాచారాన్ని అందిస్తాయని డాక్టర్ వైఎస్సార్ విశ్వ విద్యాలయం విస్తీర్ణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.కరుణశ్రీ అన్నారు. మండలంలోని కాపవరంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృందం బుధవారం మండలంలోని కాపవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామం సమీపంలో ఉన్న వేరుశనగ పంటను పరిశీలించారు. అదే విధంగా వేరుశనగ పంటలో డ్రోన్ల ద్వారా చేస్తున్న పురుగుమందుల పిచికారీ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగులో ఉన్న టీసీజీఎస్–1674 రకం వేరుశనగ చీడపీడలు తట్టుకుని అధిక దిగుబడి ఇస్తుందన్నారు. పింక్ కలర్ గింజల్లో అధిక నూనె శాతం కలిసి మార్కెట్కు అనుకూలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పెద్దబాబు, డాక్టర్ విజయలక్ష్మి, హెచ్ఓ నవీన్, మణిమాల, వీహెచ్ఏ వంశీ, ఉపసర్పంచ్ చల్లయ్య, రైతులు మల్లయ్య, వెంకటేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఏలూరు (ఆర్ఆర్పేట): స్థానిక పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 24వ శాంతి కళ్యాణ మహోత్సవాలు, షష్ఠి మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, అఖండ దీపారాధన నిర్వహించారు. అనంతరం దీక్షాధారణ, వాస్తు హోమం, దేవతా ఆవాహన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రవికుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి జి.పవన్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పలువురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం/కుక్కునూరు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబా బు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలో 39 సుంకం చెల్లించని తెలంగాణ మద్యం సీసాలతో గుమ్ములూరి ముసలయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. లక్కవరం గ్రామంలో 25 మద్యం సీసాలతో పులపాకల సత్యనారాయణ అనే వ్యక్తిపై, కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామంలో తోట వెంకటేశ్వరరావు నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఈఎస్ టాస్క్ఫోర్స్ ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

బెల్ట్ షాపుపై దాడి

కొయ్యలగూడెం: కన్నాపురంలో ఎక్సైజ్శాఖ బుధవారం నిర్వహించిన దాడిలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై ఎల్.శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	42	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	80
పచ్చిమిర్చి	24-32	బీట్రూట్	64
కాకర కాయలు	28-36	కీరా దోస	40
బీరకాయలు	32	ఫ్రెంచ్బీన్స్	70
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	60-70	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-58	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణి	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

పశువుల షెడ్ల నిర్మాణ పనుల పరిశీలన

ఉంగుటూరు: పశువుల షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో గంజిరాజ్మనో జు తెలిపారు. బుధవారం గోపినాథపట్నం, యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, రామచంద్రపురం, నల్లమాడు, చేబ్రోలు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. పశువుల షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి రైతులను చైతన్యపరిచారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేస్తే గ్రాంటు అందజేస్తామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికార్లు, సహాయకులు, ఉపాధి ఫీల్డు సిబ్బంది, ఎంపీడీవో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై కళాజాత


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ఖాన్

చింతలపూడి ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా దేశంలో కోటి ఇళ్ళపై సోలార్ ప్యానెల్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. స్థానిక ట్రాన్స్కో ఏడి కార్యాలయం వద్ద బుధవారం సోలార్ విద్యుత్ వినియోగం ,సూర్య ఘర్ యోజన పథకంపై కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సూర్యరశ్మిని ఉపయోగించుకుని విద్యుత్ను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్కో ఏడీ బీవీ రాంబాబు నాయక్ , మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై చర్యలకు వినతి

కామవరపుకోట: భూ కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని ఏలూరు చైత్ర హాస్పిటల్ యజమాని డాక్టర్ ఈడుపుగంటి హరి భగవాన్, ఈడుపుగంటి నవరాజు బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ను తమ క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కామవరపుకోట నుంచి బొర్రంపాలెం వెళ్లే రోడ్డులో వారికి 15 ఎకరాల భూమి ఉందని, కామవరపుకోటకు చెందిన టీడీపీ నాయకులు మా భూమిని కబ్జా చేసేందుకు గత కొంతకాలం నుంచి ఫలసాయాన్ని దోసుకెళ్తూ, మాపై దౌర్జన్యం చేస్తున్నారని, వారి నుంచి మాకు రక్షణ కల్పించాలని ఆయనను కోరామన్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ఈ సంఘటనపై న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

భూ ప్రకంపనలతో మూగజీవాల హడల్


భూ ప్రకంపనల సమయంలో రోడ్డుపై ఒకే చోట చేరి భయంతో అరుస్తున్న శునకాలు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో బుధవారం సంభవించిన భూ ప్రకంపనలకు మూగజీవాల సైతం హడలిపోయాయి. భూమి కంపించిన సమయంలో ఒక్కసారి స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో శునకాలు ఒక్క చోటకు చేరి పెద్దగా అరిచాయి. భూమి కంపించి, ఆగిన మరుక్షణం శునకాలు అరుపులు కూడా నిలిపివేశాయని స్థానిక ప్రజలు తెలిపారు.